క్లుప్తంగా

బీటీఏ 25వ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

పాకాల : స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో బీటీఏ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ బీటీఏ 25 ఏళ్ల బహుజన ఉపాధ్యాయుల హక్కుల, సమస్యల పరిష్కారంపై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. చిత్తూరు జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించడంలో దాటవేత ధోరణి కొనసాగిస్తోందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, జ్యోతి, విజయమోహన్, రాజేంద్రుడు, సుబ్బయ్య, తులసీరామ్, గోపాలయ్య, గణేష్, రమణ, శివప్రసాద్, జయబాల పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

పాకాల : జాతీయ క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లను మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ జూలై 15 నుంచి 24వ వరకు సికింద్రాబాద్‌లో జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ జాతీయ క్యాంపులో కళాశాలకు చెందిన క్యాడెట్లు హరిబాబు, అభిషేక్, కుశల్‌కుమార్, రెడ్డిప్రవీణ్ పాల్గొన్నారని తెలిపారు. ఈ క్యాంపులో డ్రిల్, యోగా, మ్యాంప్ రీడింగ్, ఫైరింగ్, వ్యాయామం వంటి అంశాల్లో వీరు శిక్షణ పొంది కళాశాలకు మంచి పేరు తెచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మాశిలామణి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఈశ్వర్‌బాబు, రమణమ్మ, చట్టికళావతి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా మొత్తం అందజేత



చెక్‌ను అందజేస్తున్న చందమామ అశోక్

పాకాల : ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన గురుమూర్తి(55)కి రావలసిన బీమా మొత్తాన్ని నామినీకి అందజేశారు. స్థానిక యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ చందమామ అశోక్ చేతుల మీదుగా మంగళవారం రూ.2లక్షల చెక్కును మృతుని భార్యకు అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై స్కీంలో కేవలం రూ.20, రూ.436 ఏడాదికి చెల్లించి బీమా రూ.4 లక్షల వరకు పొందవచ్చని తెలిపారు.

భక్తులతో పద్మగిరి కిటకిట



పద్మగిరిపై దండాయుధపాణిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

తిరుపతి రూరల్: మండలంలోని తనపల్లె వద్ద పద్మగిరి కొండపై ఉన్న దండాయుధపాణి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం నాగుల పంచమి పురస్కరించుకుని సుబ్రమణ్యస్వామిని దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు షణ్ముఖ శర్మ స్వామి వారికి అభిషేకం నిర్వహించి విభూతి అలంకరణతో స్వామిని ముస్తాబు చేశారు. భక్తుల హరోం..హరా..నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం ఆలయం వెలుపల టెంకాయలు కొట్టి, పిండి తలిగిలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కూటమి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- హాస్టల్ విజిట్ చేసిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు



మేడపై బట్టలు ఉతికే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు



హాస్టల్ విద్యార్థులతో కలసి భోంచేస్తున్న విద్యార్థి విభాగం నేతలు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ విద్యార్థి అధ్యక్షులు చెంగల్‌రెడ్డి, చిన్నగొట్టిగల్లు మండలం విద్యార్థి విభాగం అధ్యక్షులు నక్కా హరినాథ్ ఆరోపించారు. వీరు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం రాత్రి చిన్నగొట్టిగల్లు, భాకరాపేట ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలసి అక్కడే భోజనం చేసి నాణ్యత ఎలా ఉందో తెలుసుకున్నారు. అనంతరం నిద్రించేందుకు కేటాయించిన గదులను, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. హాస్టళ్ల పరిశీలనపై నేతలు మాట్లాడుతూ నాణ్యతలేని భోజనం, తాగడానికి చేతి పంపు నీళ్లు ఇస్తున్నారని, మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయని, బట్టలు ఉతకడానికి సరైన స్థలం లేదన్నారు. చిన్నగొట్టిగల్లు ఎస్సీ హాస్టల్‌లో 70 మంది విద్యార్థులుండగా ఒక్క బాత్రూము కూడా లేదని చెప్పారు. కనీసం కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మలవిసర్జనకు సమీపంలోని చెరువుకి వెళుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో పేద విద్యార్థులకు అందించిన దుప్పట్లు, ఇనుప పెట్టెలను వాడుతున్నారే తప్ప కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఒక్క దుప్పటి కూడా ఇవ్వలేదన్నారు. ఆగస్టు 1వ తేదీన జిల్లా కలెక్టర్‌ను కలసి అక్కడి సమస్యలను వివరించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గంలోని విద్యార్థి విభాగం నేతలు యశ్వంత్ రెడ్డి, గూడూరు రఫీ, వీర నాగేంద్ర , కార్యవర్గ సభ్యులు పార్థసారథి, నరేష్, శేషారెడ్డి, లోకేష్‌రాయల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలపై 2న తిరుపతిలో సమీక్ష

–పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



తిరుమల శ్రీవారి దర్శించుకున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల పర్యాటక శాఖామంత్రి మాట్లాడారు. సింగపూర్‌లో ఏపీ బ్రాండ్లు పెంచేందుకు సీఎం చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నట్లు చెప్పారు.గండికోటను కేంద్ర నిధులతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే కార్యక్రమానికి రెండో తేదీ శ్రీకారం చుడతామన్నారు. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లా ల సంబంధించిన పర్యాటక ప్రాంతాలపై తిరుపతి వేదికగా సమీక్షిస్తామన్నారు. తిరుపతి, శ్రీశైలం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు, ఎకో టూరిజం, వెల్ఫేర్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ టూరిజం ఏర్పాటు చేసి రాయలసీమను అభివృద్ధి చేస్తామన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు పర్యాటకశాఖ జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.

టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయం



భూమన కరుణాకరరెడ్డిని శాలువతో సత్కరిస్తున్న టౌన్‌బ్యాంకు పాలకవర్గ సభ్యులు

- మూడేళ్లు పూర్తి చేసుకున్న కో-ఆపరేటివ్ బ్యాంకు పాలకవర్గం
- భూమన కరుణాకరరెడ్డికి సత్కారం

తిరుపతి మంగళం : తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్(టౌన్‌బ్యాంక్) 105ఏళ్ల చరిత్రలో ఇంతవరకు ఎవరూ చేయలేని విధంగా టౌన్‌బ్యాంకు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ పాలకవర్గ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి అభినందించారు. కో-ఆపరేటివ్ బ్యాంకు పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసంలో భూమనతోపాటు తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిలను ఆ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వాసుయాదవ్, పాలకవర్గ సభ్యులు పోలిరెడ్డి నాగిరెడ్డి, మహ్మద్ ఖాసీం, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, జ్యోతిప్రకాష్, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, సురేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మీయంగా సత్కరించారు. భూమన కుటుంబం తమకు కల్పించిన అవకాశంతోనే టౌన్‌బ్యాంకు అభివృద్ధి, ఖాతాదారులకు విశేష సేవలందించగలుగుతున్నామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, తదితులు పాల్గొన్నారు.

కామ్రేడ్ నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం



కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద, బడుగు, బలహీన, గ్రామిక వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు రామిశెట్టి వెంకయ్య, ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కామ్రేడ్ నాగిరెడ్డి 49వ వర్ధంతి పురస్కరించుకుని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి మాట్లాడారు. తన భూములను సైతం పేదలకు పంచి పెట్టి మహానుభావుడు అని నాగిరెడ్డి అని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన ప్రజా సమస్యలను అసెంబ్లీ, పార్లమెంట్‌లోనే కాకుండా కోర్టులో సైతం వినిపించారని ఆయన సేవలను కీర్తించారు. కార్యక్రమంలో పి.వెంకటరత్న, లోకేష్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత రాము, పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ ఎం.అరుణ, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుజాత, జాకీర్, వెంకటరామిరెడ్డి ,వెంకటరమణ, అంకమనాయుడు పాల్గొన్నారు.

గుండెపోటు బాధితులకు ప్రాణరక్ష సీపీఆర్ చికిత్స

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



సీపీఆర్ చికిత్స విధానాన్ని ప్రదర్శనపూర్వకంగా చూపుతున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: గుండెపోటుకు గురై కుప్పకూలిన వ్యక్తికి తక్షణం సీపీఆర్ అత్యవసర చికిత్సతో ప్రాణాలను కాపాడేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. జేసీఐ తిరుపతి అలుమిన్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రష్ హాస్పిటల్లో మంగళవారం సీపీఆర్ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిపాయి మాట్లాడుతూ, సీపీఆర్‌ను అందరూ నేర్చుకుని తద్వారా హార్ట్ ఎటాక్ బాధితుల ప్రాణాలు నిలిపేందుకు కృషి చేయాలన్నారు. దీనిపై జేసీఐ అలుమిన్ క్లబ్ ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీఐ ట్రైనర్ రత్నశేఖర్, ప్రతినిధులు జి.శంకర్, డాక్టర్ చందన్‌కుమార్, డాక్టర గౌరి, సుప్రజ, రష్ హాస్పిటల్ సిబ్బంది, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

4 నుంచి నంద్యాలలో విద్యా వైజ్ఞానిక తరగతులు



విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌సీ నేతలు

తిరుపతి కల్చరల్: వచ్చే నెల 4, 5, 6 తేదీలలో నంద్యాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిర్వహించే రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీడీఎస్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్, జిల్లా కార్యదర్శి లోకేష్ పిలుపునిచ్చారు. నారాయణపురంలోని పీడీఎస్‌సీ కార్యాలయంలో మంగళవారం వారు విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతుల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర విద్యారంగ పరిస్థితులు-కర్తవ్యాలు, పీడీఎస్‌యూ నిర్మాణం-పని విధానం, సోషల్ మీడియా ప్రభావం-ఫలితాలు, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై నేతల ఉపన్యాసాలు ఉంటాయని చెప్పారు.విద్యార్థులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌సీ నేత జాకీర్ పాల్గొన్నారు.

ఆటో మ్యుటేషన్‌తో ఆస్తి మార్పు సులభతరం

– కమిషనర్ మౌర్య



మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆటో మ్యుటేషన్‌తో ఆస్తి మార్పు సులభతరమవుతోందని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. మంగళవారం కమిషనర్ తన కార్యాలయ చాంబర్‌లో మాట్లాడారు. నగరంలో ఏవైనా ఆస్తులు కొనుగోలు చేసిన తర్వాత వారి పేర్లపై మార్చుకునేందుకు ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రభుత్వం నూతన విధానం తీసుకు వచ్చిందన్నారు. ఈ విధానంతో స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు ఆస్తి పన్నుల్లో ఆటోమేటిక్‌గా మారుతాయన్నారు. ఈ విధానాన్ని ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మ్యుటేషన్ చేసేందుకు సమయం పడుతుందని, ఈ విధానం ద్వారా త్వరగా పూర్తవుతుందని తెలిపారు. తప్పుడు రికార్డులు లేకుండా సక్రమంగా ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఇక, పీ4 పథకానికి సంబంధించి బంగారు కుటుంబాల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు.

3న సూళ్లూరుపేటలో సీపీఐ జిల్లా మహాసభ



జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: సూళ్లూరుపేటలో ఆగస్టు 3న నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభకు పార్టీ శ్రేణులు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆయన జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీయేనన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే జిల్లా మహాసభలకు ప్రాధాన్యత ఉందన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలతో వెళ్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని మోడీ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో నల్లచట్టాలు తీసుకొచ్చి కార్మికుల కడుపుకొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని అధికారంలోకి వచ్చి 12 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇటు ప్రజలను, అటు కార్మికులనే కాక నిరుద్యోగ యువతను సైతం దగా చేస్తూ దగాకోరు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా మహాసభల్లో వీటిపై చర్చించి పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు విశ్వనాథ్, కేవై రాజా, శివ, నాగరాజు, పద్మనాభరెడ్డి, బాబు, కాశయ్య, శ్రీను, ప్రవీణ్, పూర్ణ, రత్నమ్మ, ప్రమీల, వెంకటేష్, శేఖర్, బాల పాల్గొన్నారు.

పోలీసుల 'పల్లె నిద్ర'



మాట్లాడుతున్న రూరల్ సీఐ మంజునాథరెడ్డి

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం దళితవాడలో మంగళవారం రాత్రి రూరల్ సీఐ మంజునాథరెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు గ్రామంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తిప్రపత్తులతో నాగ పంచమి పూజలు



నాగాలమ్మకు పూజలు చేసి మొక్కుతున్న భక్తులు

తిరుపతి కల్చరల్: శ్రావణమాసం నాగ పంచమి, గరుడ పంచమి పర్వదినం సందర్భంగా నగరంలో వివిధ నాగాలమ్మ ఆలయాల వద్ద మంగళవారం భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. అన్నమాచార్య కళామందిరం ఆవరణలో నాగాలమ్మకు అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు మాట్లాడుతూ హైందవ సంస్కృతిలో పశుపక్ష్యాదులను కూడా దైవ స్వరూపులుగా ఎంచి పూజలు చేయడం పరిపాటి అని, గరుడ పంచమి, నాగ పంచమి రోజున నాగు, గరుత్మంతుని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో సురేష్ స్వామి, గోపినాథ్, సుబ్రమణ్యం, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కల్యాణి, ఉదయ్, మహిళలు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఇస్కాన్ మందిరంలో ఉదయం 9.30 గంటలకు రామాయణ, మహాభారతం, భాగవతం అంశాలపై వక్తృత్వ పోటీలు
- ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మలగుంటలోని క్రీడా మైదానంలో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ పోటీలు
- తిరుచానూరులోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు స్వామి వారి తిరుచ్చి ఉత్సవం

నేడు సేవా కార్యక్రమాలతో అభినయ్ జన్మదిన వేడుకలు

తిరుపతి మంగళం: తిరుపతి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని బుధవారం నగరంలో పలుచోట్ల అన్నదానం, రక్తదాన శిబిరం, వృద్ధులు, అనాథలకు పండ్లు పంపిణీ తదితర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉదయ్ వంశీ తెలిపారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురం గ్రామ దేవత శ్రీ వస్కోటల అమ్మవారి(కనకదుర్గమ్మ)కు మంగళవారం శ్రీనివాసమంగాపురం గ్రామస్తులు అభిషేకాలు, చేసి పొంగళ్లు సమర్పించారు. రాత్రి అమ్మవారు పుష్పపల్లకిపై పుర వీధుల్లో ఊరేగారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.

చికిత్స పొందుతూ టీటీడీ ఉద్యోగి మృతి



మృతి చెందిన రాజశేఖర్

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీటీడీ ఉద్యోగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చంద్రగిరి సమీపంలోని రాజేంద్ర నగర్‌కు చెందిన రాజశేఖర్ టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీన విధులు ముగించుకుని బైక్‌పై చంద్రగిరికి వెళ్తుండగా తొండవాడ సమీపంలోని సాయి బాబా ఆలయం సమీపంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో రుయా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు స్విమ్స్‌లో అడ్మిట్ చేశారు. మంగళవారం ఆయన పరిస్థితి విషమించి మృతి చెందారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.